
సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 10 । జూన్ । 2023



ఎండ వేడి.. కొండెక్కిన కోడి
మాంసాహార ప్రియులకు చుక్కలు చూపిస్తూ చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. రికార్డు స్థాయిలో స్కిన్‌లెస్ కిలో రూ.400కు చేరింది. - 8లో▸



డెల్టాలకు 7,000 క్యూసెక్కులు
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
46.5°/29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	46.5	29.0
కాకినాడ	43.2	29.4
అమలాపురం	45.0	30.0

హృదయపూర్వకం..

- బాధితుల పట్ల సీఎం జగన్ ఔదార్యం
- బుధవారం మధ్యాహ్నం రాజోలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి
- గురువారం సాయంత్రానికి చెక్‌లు అందజేత
- 24 మందికి రూ.26 లక్షల పంపిణీ

'అడగాలే కాని... ఏదైనా ఇచ్చే అన్నయ్య నౌతా'... అని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. పేదలు, సామాన్యులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగ బాధితుల పట్ల ఆయన ఔదార్యం చూపించారు. తాము కష్టాలలో ఉన్నామని, ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరిన 24 గంటలలో వారికి సాయం అందించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తనయుడి వివాహానికి హాజరయ్యేందుకు సీఎం జగన్ బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు బాధితులు సీఎం జగన్‌ను కలసి వినతులు అందజేశారు. సీఎం జగన్‌ను బుధవారం సాయంత్రం ఆర్థిక సహాయం కోరగా, గురువారం సాయంత్రానికి బాధితులకు చెక్‌లను కలెక్టర్ హిమాన్షు శుక్లా లబ్ధిదారులకు అందజేయడం గమనార్హం. 24 మందికి రూ.లక్ష చొప్పున సాయం అందించడంతోపాటు అవసరమైనవారికి ఆరోగ్యశ్రీలో వైద్యం అందించాలని సీఎం జగన్ ఆదేశించారు. సుజాత అనే మహిళకు రూ.రెండు లక్షలు ఇచ్చారు. మొత్తం 25 మందికి రూ.26 లక్షలు అందించారు.

– సాక్షి అమలాపురం




❖ మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన దివ్యాంగుడు కేతా శ్రీనివాసరావు తనకు ఇస్తున్న పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని, తమ ప్రాంతంలో రహదారి నిర్మాణం చేపట్టాలని సీఎం జగన్‌ను కోరారు. వ్యవసాయం చేసుకునే శ్రీనివాసరావుకు సీఎం ఆదేశాల మేరకు రూ.లక్ష తక్షణ సాయంగా అందింది. ఈ సొమ్మును ఉపయోగించుకుని నెలవారీ ఆదాయం పెంచుకోవాలని సూచించారు.




❖ మలికిపురం మండలం పడమటిపాలేనికి చెందిన మేడిద సుజాత కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం రూ.రెండు లక్షలు కావాలని సీఎం జగన్‌ను అభ్యర్థించారు. సీఎం ఆదేశాల మేరకు రూ.రెండు లక్షల సాయం అందింది.




❖ తలసేమియా, బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న మలికిపురం మండలం గూడపల్లి పల్లిపాలేనికి చెందిన ఎం.జి.ప్రకాష్‌రాజ్ సీఎం జగన్ వద్ద గోడు వెళ్లబోసుకున్నాడు. దీనికి స్పందించిన సీఎం అతనికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించడంతోపాటు మెరుగైన వైద్య సేవలకు ఆదేశించారు.




❖ దివ్యాంగుడైన తాను చిరు వ్యాపారం చేసుకుంటున్నానని, తన వ్యాపార అవసరాల కోసం మూడు చక్రాల మోటారు సైకిల్ కావాలని మలికిపురం మండలం గూడపల్లి గుబ్బలపాలేనికి చెందిన గుబ్బల హేమంత్ కుమార్ కోరాడు. సీఎం జగన్ అతనికి రూ.లక్ష మంజూరు చేశారు.




◆ సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన పోతాబత్తుల వెంకట నారాయణ వేటపై జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తనను ఆదుకోవాలని కోరగా రూ.లక్ష మంజూరు చేశారు.




❖ మలికిపురానికి చెందిన రాపాక జాన్ విల్సన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నానని విన్నవించాడు. సీఎం జగన్ రూ.లక్ష ఆర్థిక సాయం చేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.




❖ సఖినేటిపల్లికి చెందిన ఆకుల బేబీ వెంకట లక్ష్మి దివ్యాంగురాలు. తనకు ఉపాధి మార్గం చూపాలని కోరారు. సీఎం జగన్ స్పందించి రూ.లక్ష మంజూరు చేశారు. ఈ సొమ్ముతో ఆదాయాన్ని పెంచుకునే ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని ఆకాంక్షించారు.




❖ మామిడికుదురు మండలం ముత్యాలపాలేనికి చెందిన దివ్యాంగుడు కొండేపూడి బాల నిరుద్యోగి. తనకు ఇస్తున్న పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచాలని కోరగా, సీఎం జగన్ అతనికి రూ.లక్ష అందించారు. ఈ సొమ్మును ఉపయోగించుకుని నెలవారీ ఆదాయం పెంచుకోవాలన్నారు.




❖ సఖినేటిపల్లి మండలం మోరిపోడుకు చెందిన దివ్యాంగుడు పితాని ఏసుబాబు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నాడు. వ్యాపారం విస్తరించేందుకు సహకరించాల్సిందిగా సీఎం జగన్‌ను కోరాగా రూ.లక్ష సహాయం అందించారు.




❖ సఖినేటిపల్లి మండలం అంతర్వేదికి చెందిన దివ్యాంగుడు పొన్నాల పరమేశ్వరరావు నిరుద్యోగి. తనకు పింఛన్ తప్ప మరో ఆదాయ మార్గం లేదని చెప్పగా అతనికి సీఎం జగన్ రూ.లక్ష సాయం అందించారు.

అడిగినవారందరికీ ఆర్థిక సాయం

- సఖినేటిపల్లి మండలం గొందికి చెందిన బొమ్మిడి నర్సింహస్వామి ఫొటో స్టూడియోలో రోజువారీ కూలీగా ఉపాధి పొందుతున్నాడు. రాజోలు మండలం సోంపల్లికి చెందిన కట్టా త్రినాథ్ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. సఖినేటిపల్లి మండలం శృంగవరప్పాడుకు చెందిన రావి శ్రీనివాసరావు రోజువారీ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. వీరు తమకు రోజువారీ వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని పింఛన్ పెంచాల్సిందిగా కోరారు.
- మలికిపురం మండలం బట్టేలంకకు చెందిన చేట్ల రామాంజనేయులు, మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం సరెళ్ల జ్యోతి, మామిడికుదురు మండలం గుర్రం శ్రీనివాసులు, సఖినేటిపల్లి మండలం శృంగవరప్పాడుకు చెందిన తోట పాండురంగ ఆంజనేయులు, మలికిపురానికి చెందిన తిరుమల చిట్టిబాబు. చింతలమోరికి చెందిన మోకా శ్రీనివాస్ నిరుద్యోగులు. రాజోలు మండలం కూనవరానికి చెందిన చోడిశెట్టి రామకృష్ణ చిరు వ్యాపారం చేస్తున్నారు. వీరంతా తమకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.
- రాజోలు మండలం సోంపల్లికి చెందిన మసకపల్లి అఖిల రోజువారీ కూలీ. గాకర్స్ వ్యాధితో బాధపడుతోంది. తనకు నెలకు ఒకసారి ఖరీదైన ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉందని వేడుకున్నారు. సఖినేటిపల్లికి చెందిన కందికట్ల శ్యామ్‌ప్రసాద్ వలంటీర్. కిడ్నీలు పాడయ్యాయని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రాజోలుకు చెందిన రాయివలస నాగ మల్లేశ్వరిది రజక వృత్తి. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు ఆర్థిక చేయూతనివ్వాలని కోరారు. మలికిపురం మండలం తూర్పుపాలెం ఒగ్గు పూజశ్రీ సోరియాసిస్‌తో బాధపడుతోంది. వీరి వినతులను పరిశీలించిన సీఎం జగన్ ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించడంతోపాటు మెరుగైన వైద్యసేవలను ఆరోగ్య శ్రీ ద్వారా అందించాలని అధికారులను ఆదేశించారు.

న్యూస్‌రీల్

13న ఐటీఐ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అన్ని ప్రైవేట్ ఐటీఐలలో 2023–24 సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 13న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అమలాపురంలోని ఉపాధి కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మెరిట్ నంబర్లు ఒకటి నుంచి 78 వరకు గల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని వేణుగోపాల్‌వర్మ పేర్కొన్నారు.

ఏపీఆర్‌జేసీలో సత్తాచాటిన శరవణ్



మండపేట: ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన దొంగా శ్రీవెంకట శరవణ్‌కు శుక్రవారం పలువురు స్థానికులు అభినందనలు తెలిపారు. పట్టణంలోని రావులపేటకు చెందిన శరవణ్ ఇటీవల విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, తాజాగా విడుదలైన ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో 2వ ర్యాంకు సాధించాడు. తండ్రి త్రిమూర్తులు పాలతోడులోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో మంచి ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని శరవణ్ తెలిపాడు.

టీడీపీవి అసందర్భ హామీలు

అమలాపురం టౌన్: భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ కాపీ పేస్ట్ మ్యానిఫెస్టోతో చంద్రబాబు, లోకేష్‌లు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలను మరోసారి అసందర్భ హామీలతో మోసం చేయడానికి సిద్ధమవుతున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. అమలాపురంలో శుక్రవారం ఈ మేర కు ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చతికలపడ్డ టీడీపీకి ఇప్పుడు అయిదారు పార్టీలతో పొత్తులు పెట్టుకుని జనరంజక పాలనతో సాగుతున్న జగన్‌పై గెలిచే సత్తా ఉందా? అని ప్రశ్నించారు. బీసీలకు రాజ్యాంగ రక్షణ కల్పిస్తామంటున్న చంద్రబాబు, లోకేష్ ముందు బీసీలలో మీ పట్ల నమ్మకం కలిగించుకోండి అని సలహా ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో బీసీలకు ఎంతటి గౌరవం దక్కుతోందో పారదర్శకంగా కనిపిస్తోందన్నారు. లోకేష్ పాదయాత్రలో స్థాయికి మించిన మాటలతో రెచ్చిపోతూ చేతకాని తనాన్ని బయట పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు.

ప్రీ ఆడిట్‌తో పారదర్శకత

- రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో నిర్వహణకు రంగం సిద్ధం
- ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్



అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ హరి ప్రకాష్

అమలాపురం టౌన్: ఇంతకాలం పోస్ట్ ఆడిట్‌లతో మున్సిపాలిటీల్లో నిధుల ఖర్చులు, లెక్కలు, బిల్లుల చెల్లింపులను తేల్చే పద్ధతిని ఇక నుంచి ప్రీ ఆడిట్ ద్వారా అమలు చేయనున్నామని రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ ఆర్.హరిప్రకాష్ అన్నారు. అమలాపురం మున్సిపాలిటీలో జిల్లాలోని మున్సిపాలిటీల ఆడిటర్లు, అధికారులు, ఇంజినీర్లతో శుక్రవారం ప్రీ ఆడిట్ అమలుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో త్వరలోనే ప్రీ ఆడిట్ మొదలు కానుందని తెలిపారు. ఇది ఆన్‌లైన్‌లో జరుగుతుందని చెప్పారు. ఇందు కోసం ఇప్పటికే అంటే మే 15వ తేదీ అంతా సిద్ధం చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో కాదు..జాతీయ స్థాయిలో కూడా ప్రీ ఆడిట్‌కు పూర్తిగా సన్నద్ధమైన ఘనత రాష్ట్ర పురపాలక శాఖకు దక్కిందని స్పష్టం చేశారు. ఆయా మున్సిపాలిటీల్లో ప్రీ ఆడిట్‌లు నిర్వహించే ఆడిట్ అధికారులు అత్యంత పారదర్శకతతో ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారన్నారు. దీనివల్ల దుబారా ఖర్చులకు కళ్లెం పడుతుందని చెప్పారు. పోస్టు ఆడిట్‌లో 10 శాతం నిధులు సేవ్ అయితే ప్రీ ఆడిట్‌లో 75 శాతానికి పైగా సేవ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే ప్రీ ఆడిట్‌ను రాష్ట్రంలో తొలిసారిగా దేవదాయ శాఖలో అమలు చేసి మంచి ఫలితాలను రాబట్టామని చెప్పారు. తర్వాత క్రమంలో పురపాలక శాఖలో చేపడుతున్నట్లు వివరించారు. ఇలా దశల వారీగా, శాఖల వారీగా ప్రీ ఆడిట్‌ను అమలు చేస్తామన్నారు. గత ఏడాది రాష్ట్రంలో రూ.230 కోట్ల విలువ చేసే బిల్లులను ప్రీ ఆడిట్ చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని జిల్లాల వారీగా ప్రీ ఆడిట్‌లపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా అడిట్ అధికారి మహ్మద్ రహ్మతుల్లా, జిల్లా సహాయ ఆడిట్ అధికారులు ఎం.సాంబశివయ్య, ఏవీవీ సత్యనారాయణ, కె.లక్ష్మి, డి.నాగేశ్వరరావు, అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, జిల్లాలోని మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీ అధికారులు, ఇంజినీర్లు, అకౌంటెంట్లు, ఆర్వోలు పాల్గొన్నారు.

పక్కాగా బదిలీలు.. పదోన్నతులు

- 8,052 మంది దరఖాస్తు
- రేపటికి పూర్తికానున్న ప్రక్రియ
- హెచ్‌ఎంలు బాధ్యతల స్వీకరణ

రాయవరం: గతంలో బదిలీల ప్రక్రియ అంటే ఒక ప్రహసనంగా ఉండేది. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం బదిలీలు జరిగేవి కావు. షెడ్యూల్‌ను పొడిగించాల్సిన పరిస్థితులు ఉండేవి. ఇప్పుడా పరిస్థితికి విద్యాశాఖ చెక్ పెట్టింది. గతానికి భిన్నంగా ఈసారి బదిలీలు, పదోన్నతులు పక్కాగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించడంతో ఉపాధ్యాయుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. గత నెల 22న బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం నాటికి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు విద్యాబోధనకు సిద్ధం కానున్నారు.

రెండేళ్ల అనంతరం

2020లో బదిలీ షెడ్యూల్ ఇవ్వగా, 2021 జనవరిలో ఉపాధ్యాయులు బదిలీలకు నోచుకున్నారు. తిరిగి రెండేళ్ల తర్వాత ఉపాధ్యాయుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బదిలీలకు షెడ్యూల్ విడుదల చేసింది. మే నెల 23 నుంచి 26 వరకు వివిధ క్యాడర్లకు చెందిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరిగిన బదిలీల్లో కంపల్సరీ, రిక్వెస్ట్ బదిలీలు కోరుతూ 8,052 మంది దరఖాస్తు చేసుకున్నారు. కేవలం 20 రోజుల్లో విద్యాశాఖ బదిలీలను పక్కాగా నిర్వహించింది. ఈ నెల 7వ తేదీ రాత్రి గ్రేడ్–2 హెచ్‌ఎంలకు బదిలీ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ నెల 8వ తేదీన బదిలీ అయిన గ్రేడ్–2 హెచ్‌ఎంలు స్థానచలనానికి గురైన పాఠశాలల్లో చేరాలని ఇచ్చిన ఆదేశాలతో ఎక్కడికక్కడ పాఠశాలల్లో కొత్త హెచ్‌ఎంలు విధుల్లో చేరారు. శుక్రవారం స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు విడుదల కానున్నాయి. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వెంటనే ఎస్‌ఏలు కూడా శనివారంలోగా బదిలీ అయిన స్థానాల్లో విధుల్లో చేరనున్నారు. శనివారం సెకండరీ గ్రేడ్ క్యాడర్ ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు విడుదల కానున్నాయి. మొత్తం మీద బదిలీ అయిన ఉపాధ్యాయులంతా ఈ నెల 11లోగా ఆయా పాఠశాలల్లో చేరాల్సి ఉంది.




బండారులంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరిన గ్రేడ్–2 హెచ్‌ఎం బాల

పదోన్నతులు పొందిన వారికి సైతం

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన వారికి సైతం ఉద్యోగోన్నతితో పాటు, వారికి పోస్టింగ్ ఉత్తర్వులు కూడా విడుదలయ్యాయి. ఇప్పటికే గ్రేడ్–2 హెచ్‌ఎంలకు ఉత్తర్వులు విడుదల కాగా, శుక్రవారం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందిన వారికి ఉత్తర్వులు విడుదలకానున్నాయి. వీరు కూడా వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

అభ్యంతరాలు పరిష్కరిస్తూనే..



బదిలీల ప్రక్రియను సమర్థంగా నిర్వహించాం. షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ చేపట్టాం. ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరిస్తూనే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించాం. బదిలీలు పొందిన వారంతా వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలి.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈవో, కాకినాడ.

పేదల కుటుంబాల్లో వెలుగులు



వేగాయమ్మపేటలో లబ్ధిదారునికి ఇంటి స్థలం పట్టా అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: తమ వారసులకు ఎలాంటి భూమిని ఇవ్వలేని జనం పరిస్థితులను తన పాదయాత్రలో గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆ కుటుంబాల్లో వెలుగులు నింపారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వేగాయమ్మపేటలో 17 ఎకరాల్లో 307 మంది లబ్ధిదారులకు రెండో దఫా జగనన్న ఇళ్ల పట్టాలను మంత్రి వేణు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ పేదవాడి కలను సాకారం చేసిందన్నారు. కూలి నాలి చేసుకునే తమ సొంత ఇంటి కల సాకారం అవుతుందా అని ఆలోచిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై చూపిన ఆదరణను లబ్ధిదారులు మంత్రి వేణుతో పంచుకున్నారు. సుమారు రూ.10 లక్షల విలువైన సెంటున్నర భూమి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇవ్వడం సంతోషంగా ఉందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ సాకా బాబి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు రుణాలు

కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: జిల్లాలో వ్యవసాయ కార్మికుల సంఖ్య తగ్గిన నేపథ్యంలో సాగుకు ఇబ్బంది లేకుండా యాంత్రీకరణకు పెద్ద పీట వేయాల్సి ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాయితీ రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు సహకరించాలని కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం లీడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ, సమీక్ష కమిటీ సమావేశపు 2022–23 నాల్గవ త్రైమాసిక అజెండాపై సమీక్షించారు. కలెక్టర్ శుక్లా బ్యాంకు బ్రాంచీల వారీగా వివిధ సెక్టార్లకు సంబంధించి లక్ష్యాలు, లక్ష్యసాధనపై సమీక్ష జరిపారు. వందశాతం లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన చర్యలను బ్యాంకర్లకు సూచించారు. బ్యాంకు రుణంతో ముడిపడి ఉన్న ప్రభుత్వ రాయితీ పథకాల అమలులో బ్యాంకర్లు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ మార్గదర్శకాల ప్రకారం గ్రామీణ అభివృద్ధి బ్యాంకుల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై నిరంతర సమీక్ష ఉండాలన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కూడా ప్రాధాన్యమిచ్చి గ్రామీణ నిరుపేదల జీవనోపాధి పెంచేలా చూడాలని కలెక్టర్ శుక్లా తెలిపారు. కోనసీమ జిల్లాలో కౌలు రైతులకు పైలట్ ప్రాజెక్టుగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా పంట రుణాలు అందించేందుకు పది మండలాలను ఎంపిక చేశామన్నారు. ఇది విజయవంతమైతే అన్ని మండలాల్లో అమలు చేస్తామన్నారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ కె.శ్యాంబాబు, జిల్లా మత్స్యశాఖ జేడీ లాల్ మహమ్మద్, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, నాబార్డ్ ప్రతినిధి స్వామినాయుడు మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

ఆసక్తి ఉన్నవారికి గృహ రుణాలు

సొంత ఇల్లు ఉండాలనే ఆసక్తి, సొంత ఇల్లు నిర్మించుకోవాలనే తపన ఉన్న లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో గృహ నిర్మాణ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇళ్ల స్థలాల చదును, ఇళ్ల కేటాయింపులపై ఆయన సమీక్ష జరిపారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ అర్హత సాధించిన లబ్ధిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్నారు. లబ్ధిదారులకు మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడం, అంతర్గత రహదారులు, అప్రోచ్ రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు డ్వాక్రా ద్వారా రూ.35 వేలు రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. హౌసింగ్ ఈఈ సీహెచ్ బాబూరావుతోపాటు పలువురు ఇంజినీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



అతికిన శెట్టి శ్రీను మృతదేహం



చెరువులో బోల్తాపడిన ట్రాక్టర్

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం బ్రహ్మలింగం చెరువు వద్ద ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అతికిసెట్టి శ్రీను (45) మృతి చెందాడు. కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీరంగపట్నానికి చెందిన డ్రైవర్ శ్రీను బ్రహ్మలింగం చెరువు పుంతలోని చెరువు నుంచి ట్యాంకర్‌లోకి నీరు ఎక్కిస్తుండగా ప్రమాదం సంభవించింది. చెరువులోని నీటిని ట్రాక్టర్‌లోని ట్యాంక్‌లోకి ఎక్కిస్తుండగా ట్రాక్టర్ చెరువులోకి ఒరిగింది. దాన్ని గట్టు పైకి క్కిస్తుండగా బోల్తాపడి మృతిచెందాడు. డ్రైవర్ శ్రీనుకు భార్య కొండమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు స్వామి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూతురు లోవమ్మకు వివాహం చేశారు. ప్రతీరోజులా పనిచూసుకుని ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న భార్య కొండమ్మ భర్త మృతి చెందిన విషయం తెలిసి బోరున విలపించింది. కుటుంబ సభ్యులు శ్రీరంగపట్నానికి చేరుకుని మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఎండ వేడి.. కొండెక్కిన కోడి

- రికార్డు స్థాయిలో కిలో చికెన్ రూ.400
- చుక్కల్లో మేత ధరలు
- కొత్త బ్యాచ్‌లు వేసేందుకు రైతుల వెనుకంజ
- కంపెనీల పరిధిలోనే కోళ్ల పెంపకం



మండపేట: మాంసాహార ప్రియులకు చుక్కలు చూపిస్తూ చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. రికార్డు స్థాయిలో స్కిన్‌లెస్ కిలో రూ.400కు చేరింది. నాలుగు నెలలుగా సరైన ధర లేక నష్టపోవడం, పెరిగిన నిర్వహణ వ్యయం, అధిక ఎండలకు జడిసి కొత్త బ్యాచ్‌లు వేయడానికి కోళ్ల రైతులు వెనుకంజ వేస్తున్నారు. కోళ్ల లభ్యత తక్కువగా ఉండటంతో ధర పెరిగిపోతోంది. మాంసాహార ప్రియులు చికెన్‌ను ఎక్కువగా ఇష్టపడతారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో రోజుకు సుమారు మూడు లక్షల కిలోల చికెన్ వినియోగిస్తుండగా, ఆదివారం, పండగ రోజుల్లో రెట్టింపు స్థాయిలో అమ్మకాలుంటాయి. రాజానగరం, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, అమలాపురం, రావులపాలెం, తుని, తొండంగి ప్రాంతాల్లో 440 ఫామ్‌లు వరకు విస్తరించి ఉండగా ఏడు లక్షల కోళ్ల పెంపకం జరుగుతున్నట్టు అంచనా. బ్యాచ్ వేసిన 40 రోజుల్లో బ్రాయిలర్ కోళ్లు రెండు నుంచి రెండున్నర కేజీల వరకు పెరిగి వినియోగానికి వస్తుంటాయి. పండగలు, పెళ్లిళ్ల సీజన్‌ను బట్టి రైతులు ఎప్పటికప్పుడు కొత్త బ్యాచ్‌లు వేస్తుంటారు.

పెరిగిన ఖర్చులు

అధిక ఉష్ణోగ్రతలతో కోళ్ల మరణాలు పెరిగి రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఎండలకు జడిసి వేసవిలో కొత్త బ్యాచ్‌లు వేసేందుకు వెనకాడతారు. దీనికితోడు ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ. 200కు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. మేత ధరలు గిట్టుబాటయ్యేలా లేకపోవడం కొత్త బ్యాచ్‌లు వేయకపోవడానికి మరో కారణంగా చెబుతున్నారు. మొక్కజొన్న కిలో రూ.20 ఉండగా, సోయా రూ.50, అన్ని మేతలు మిక్స్ చేసి అమ్మే కంపెనీ మేత కిలో రూ.43 వరకు ఉంది. కోడిపిల్ల ధర రూ.26 నుంచి రూ.30 వరకు ఉంది. కోడిమేత, మందులు, ఇతర నిర్వహణ ఖర్చులతో లైవ్ కిలో కోడి తయారవ్వడానికి రూ.110 వరకు వ్యయమవుతోందంటున్నారు. ఆయా కారణాలతో రెండు నెలలుగా అధికశాతం మంది రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. సొంతంగా నిర్వహణ చేయలేక కమీషన్‌పై కోడిపిల్లలను పెంచి పెద్దవి చేసి ఇచ్చేందుకు బ్రాయిలర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. స్థానిక అవసరాలకు తగ్గట్టుగా కోళ్ల లభ్యత లేకపోవడం, అధికశాతం ఫామ్‌లు కంపెనీల అధీనంలోనే ఉండటం ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.400 వరకు అమ్మకాలు చేస్తుండగా, లేయర్ కోడి రూ.130 వరకు ఉంది. సాధారణంగా రెండు నుంచి మూడు కిలోల వరకు బరువు పెరిగాక కోళ్లను మార్కెట్‌కు తరలిస్తుంటారు. కాగా 1.5 కిలో నుంచి 1.8 కిలో బరువున్న కోళ్లను అమ్మకాలు చేసేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నెలాఖరు వరకు ధర తగ్గకపోవచ్చని వ్యాపార వర్గాలంటున్నాయి.

నష్టాలకు జడిసి

జనవరి నుంచి ఏప్రిల్ వరకు గిట్టుబాటు ధర లేక కోళ్ల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. దీనికితోడు గతంలో పోలిస్తే నిర్వహణ వ్యయం రెట్టింపు అవుతోంది. ఎండలకు జడిసి చాలామంది కొత్త బ్యాచ్‌లు వేయక ధర పెరిగిపోతోంది.

– బొబ్బా వెంకన్న, బ్రాయిలర్ కోళ్ల రైతు, పెదపళ్ల, ఆలమూరు మండలం


ఫుడ్ డెలివరీ బాయ్ నిజాయితీ



సత్యవేణికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న డీఎస్పీ రాంబాబు

కాకినాడ క్రైం: ఓ ఫుడ్ డెలివరీ బాయ్ తన నిజాయితీని చాటుకొని ఆదర్శంగా నిలిచాడు. తనకు దొరికిన డబ్బు సంచిని పోలీసులకు అప్పగించి, బాధితులకు అందివ్వాలని కోరాడు. వివరాల్లోకి వెళితే, కాకినాడ గ్రామీణ మండలం ఇంద్రపాలేనికి చెందిన కుడిపూడి సత్యవేణి శుక్రవారం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ కాకినాడ కల్పన సెంటర్‌లో తన హేండ్ బ్యాగ్‌ను జారవిడుచుకున్నారు. ఆ బ్యాగ్‌లో రూ.50 వేల నగదు, ఓ సెల్‌ఫోన్ ఉన్నాయి. ఈ బ్యాగ్ కాకినాడ ఏపీఎస్పీకి చెందిన జొమాటో సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న పోసిన దినకర్‌కు దొరికింది. ఆ యువకుడు నిజాయితీగా ఆ బ్యాగ్‌ను కాకినాడ సీసీఎస్ డీఎస్పీకి అప్పగించాడు. డీఎస్పీ రాంబాబు బాధిత మహిళకు ఆ బ్యాగ్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా దినకర్ నిజాయితీని పోలీసులు, మహిళ కుటుంబీకులు మెచ్చుకున్నారు.

త్వరలో రత్నగిరిపై విద్యుత్ శంఖు చక్రనామాలు



రత్నగిరిపై ఏర్పాటు చేయనున్న విద్యుత్ శంఖు,చక్రనామాల నమూనా

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో త్వరలో విద్యుత్ దీపాల 'శంఖు చక్ర నామాలు' భక్తులకు కనువిందు చేయనున్నాయి. ఇప్పటికే దేవస్థానంలోని న్యూ సీసీ సత్రంలో 42 అడుగుల ఎత్తు గల విద్యుత్ నామం భక్తులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఆ నామానికి ఇరువైపులా రూ.72 లక్షల వ్యయంతో శంఖు చక్రాలను ఏర్పాటు చేయడానికి టెండర్లు ఆహ్వానించినట్టు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం తెలిపారు. జాతీయ రహదారిపై వివిధ వాహనాల్లోనూ, రైళ్లలో ప్రయాణించే భక్తులకు ఈ శంఖు చక్రనామాలు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. తాజా అంచనాల ప్రకారం శంఖు చక్ర నామాలు 48 అడుగుల ఎత్తు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కాగా విద్యుత్ శంఖు చక్ర నామాల ఏర్పాటు పనులను దేవస్థానం విద్యుత్ డీఈ సూర్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

క్రిమినల్ కేసుకు సిఫారసు



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రాజమహేంద్రవరం రూరల్/కంబాలచెరువు: ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా 27.50 క్వింటాళ్ల పీడీఎస్ (చౌక) బియ్యంను తరలిస్తున్న వాహనాన్ని కాతేరు గామన్ బ్రిడ్జి వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న డ్రైవర్‌తో పాటు, బియ్యం యజమాని, కొనుగోలు చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదుకు పోలీసులకు సిఫారసు చేశారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులతో కలసి వాహనాన్ని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. వివిధ రంగుల్లో ఉన్న 55 బస్తాలలో 27.50 క్వింటాళ్ళ పీడీఎస్(చౌక) బియ్యంను గుర్తించారు. ఆ వాహనం ఏలూరు జిల్లా పోలవరంనకు చెందిన కొట్టు రాజబాబుకు చెందినది. పోలవరంనకు చెందిన డ్రైవర్ దాసరి సుబ్బారావు ఆ బియ్యాన్ని ఏలూరు జిల్లా కుక్కునూరు నుంచి కాకినాడ జిల్లాలోని పెద్దాపురానికి సరైన బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నాడు. పీడీఎస్ బియ్యం పోలవరంనకు చెందిన చోడిపిండి ఆదివిష్ణు (చంటి) చెందినవి. 6–ఏ కింద కేసు నమోదు చేసి, ఈ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తుల పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, రూరల్ ఎంఎస్‌వో ప్రభాకర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

700 కిలోల రేషన్ బియ్యం సీజ్

మామిడికుదురు: అక్రమంగా నిల్వ ఉంచిన 700 కిలోలు రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మామిడికుదురులో గోకవరపు శ్రీనివాసరావు ఇంట్లో 17 మూటల్లో నిల్వ ఉంచిన రూ.68 వేలు విలువైన రేషన్ బియ్యాన్ని సీజ్ చేశామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ ఇన్‌చార్జి అధికారి కె.కుమార్ తెలిపారు. ఆటోను సీజ్ చేశామని, శ్రీనివాసరావుపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడంతో పాటు నిల్వ ఉంచినందుకు కేసు నమోదు చేశామన్నారు.

నైపుణ్యముంటే కొలువులు సులువు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నన్నయ యూనివర్సిటీలో జాబ్‌మేళా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలను సులువుగా అందుకోవచ్చని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన 'జాబ్ మేళా' వీసీ ఆచార్య కె.పద్మరాజుతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్లు, పోస్టు గ్రాడ్యుయేషన్లు చేసినా నిరుద్యోగ సమస్య వెన్నాడుతున్నదంటే అందుకు ప్రధాన కారణం సరైన నైపుణ్యాలు లేకపోవడమేనన్నారు. ఈ సమస్యను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మండల కేంద్రంలో స్కిల్‌హబ్, జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజ్, హబ్‌లను ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇందులో భాగంగా 'నన్నయ' వర్సిటీలో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'నన్నయ' వర్సిటీ ప్రగతికి తన వంతు కృషి చేస్తానన్నారు. వీసీ ఆచార్య పద్మరాజు ఆధ్వర్యంలో రానున్న రెండేళ్లలో అభివృద్ధి సాధిస్తుందనే నమ్మకం ఉందని అన్నారు. వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ దేశంలో ఉద్యోగావకాశాలకు కొదవ లేదని, అయితే వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాలు కొరవడడంతోనే నిరుద్యోగ సమస్య వస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యారంగానికి వెచ్చిస్తున్న నిధులు ఖర్చు కాదని, భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించాలన్నారు. ఈ జాబ్‌మేళాలో 13 కంపెనీలు పాల్గొనగా 456 మంది హాజరయ్యారు. 77 మందికి ఉద్యోగాలు లభించాయి. 19 మందిని షార్ట్ లిస్ట్ చేశారు. వీరికి త్వరలో ఆన్‌లైన్‌లో నియామక సమాచారం అందజేస్తారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కొండలరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, రాజానగరం, కోరుకొండ జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెదవెంకన్న, కర్రి నాగేశ్వరరావు, కోరుకొండ మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కర్రి పాపారావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో మెరుగైన వసతులు



బ్రహ్మశ్రీ చాగంటికి శ్రీశైలం మల్లన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

బోట్‌క్లబ్/కాకినాడ రూరల్: ఆలయాల్లో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ఈఓల బాధ్యతని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక దేవదాయశాఖ కార్యాలయానికి వచ్చారు. ఆయనకు డీసీ ఎం.విజయరాజు, వేద పండితులు స్వాగతం పలికారు. కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన ఈఓలకు ఆయన పలు సూచనలిచ్చారు. రూ.ఐదు లక్షల ఆదాయం ఉన్న ఆలయాలను త్వరలోనే అర్చకులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన తిమ్మాపురంలోని ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు నివాసానికి వెళ్లారు. కార్తిక మాసంలో శ్రీశైలంలో నిర్వహించనున్న మహాకుంభాభిషేకం నిర్వహణపై ఆయనతో కొద్ది సేపు చర్చించారు. ఆయన వెంట దేవదాయశాఖ రీజినల్ కమిషనర్ ఎం.సురేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, కాకినాడ డీఈఓ పి.నారాయణమూర్తి, రాజమండ్రి డీఈఓ వి.సోమరాజు, శ్రీశైలం ఆలయ ఈఓ ఎస్.లోవన్న ఉన్నారు.

డ్రోన్ ఎక్స్‌లెన్స్ కోసం జేఎన్‌టీయూకే ఒప్పందాలు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న పాల్కన్ ఇన్ఫో ప్రతినిధులు, వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ.. రాజస్థాన్‌కు చెందిన పాల్కన్ ఇన్ఫో సొల్యూషన్, న్యూఢిల్లీకి చెందిన ఆయోటెక్ వరల్డ్ యావిగేషన్ ప్రైవేట్ సంస్థలతో శుక్రవారం ఒప్పందం చేసుకుంది. వీసీ సమావేశపు హాల్లో సంస్థల ప్రతినిధులు వీసీ ప్రసాదరాజుతో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. డ్రోన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కోసం ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఒప్పందాల ద్వారా ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి అవకాశాలు పెరుగుతాయని, విద్యార్థులకు డ్రోన్ పైలట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో శిక్షణ ఇచ్చి డైరెక్టర్ జనరల్ సివిల్ ఏవియేషన్ ద్వారా సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఒప్పందంలో భాగంగా 10 కోర్సులలో శిక్షణ అందిస్తారన్నారు. ఈ శిక్షణ వ్యవసాయ, ఆరోగ్య, రెవెన్యూ, విమానయాన రంగాలకు సంబంధించి డ్రోన్‌లను వినియోగించేందుకు ఉపయోగంగా ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ సుమలత, ఐక్యూఏసీ డైరెక్టర్ బాలాజీ, డీఏపీ మురళీకృష్ణ, వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో మార్పులు..చేర్పులు

నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు



ముమ్మిడివరంలోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయం

రాయవరం: సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) కార్యాలయాల్లో మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది అభ్యర్థనల మేరకు ప్రస్తుతం ఉన్న ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో మండలాలను మార్పు చేసింది. జిల్లాలో కొత్తగా ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఏర్పడనప్పటికీ ఉన్న ప్రాజెక్టుల్లో రెండు ప్రాజెక్టులు నియోజకవర్గ కేంద్రంగా ఏర్పడ్డాయి. నియోజకవర్గానికో ప్రాజెక్టుగా మార్పు చేశారు. రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇప్పుడు మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుగా మార్పు చేశారు. ఇంతకు ముందు రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టులో అనపర్తి, బిక్కవోలు, రాయవరం, రామచంద్రపురం మండలాలు ఉండగా, అనపర్తి, బిక్కవోలు మండలాలు రంగంపేట ప్రాజెక్టులోకి వెళ్లాయి. గతంలో కపిలేశ్వరపురం ప్రాజెక్టు ఉండగా, మండపేట ప్రాజెక్టు ఏర్పడడంతో కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం మండలాలతో మండపేట ప్రాజెక్టుగా మార్పు చేశారు. రాయవరం, కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఉన్న రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కలిపి నూతనంగా రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేశారు. రాయవరం ఐసీడీఎస్ పీవో రామచంద్రపురం పీవోగా, కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవో మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న అయినవిల్లి మండలం, అమలాపురం ప్రాజెక్టులోని అంబాజీపేట మండలాలను పి.గన్నవరం ప్రాజెక్టులో కలిపారు. గతంలో కపిలేశ్వరపురం ప్రాజెక్టులో ఉన్న ఆలమూరు మండలాన్ని కొత్తపేట ప్రాజెక్టులో కలిపారు.

ఏపీ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరు ఆదేశాల మేరకు జిల్లా పునర్విభజనలో భాగంగా ఈ మార్పులు, చేర్పులు చేపట్టారు.

ప్రాజెక్టు కార్యాలయం	పరిధిలోని మండలాలు
అమలాపురం	అమలాపురం(మున్సిపాలిటీ), అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం
ముమ్మిడివరం	ముమ్మిడివరం, ముమ్మివరం(నగర పంచాయతీ), కాట్రేనికోన, ఐ.పోలవరం.
కొత్తపేట	కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం ఆలమూరు
పి.గన్నవరం	పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, అంబాజీపేట
రాజోలు	రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి
మండపేట	మండపేట, మండపేట (మున్సిపాలిటీ), కపిలేశ్వరపురం, రాయవరం
రామచంద్రపురం	రామచంద్రపురం, రామచంద్రపురం (మున్సిపాలిటీ) కె.గంగవరం

కొట్లాట ఘటనలో ఐదుగురిపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని జీడిగుంటకు చెందిన వందే జయమ్మ, అతని మరిది శామ్యూల్‌పై దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస శుక్రవారం తెలిపారు. ఈనెల 8వ తేదీన జీడిగుంట గ్రామంలో జయమ్మ రోడ్డుపై నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన పరిడా విజయరాజు వేగంగా, నిర్లక్ష్యంగా బైక్ నడపడంతో ప్రశ్నించినందుకు జయమ్మ, శామ్యూలుపై విజయరాజుతో పాటు మరో నలుగురు వ్యక్తులు దాడిచేశారని బాధితురాలు జయమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



రవితేజ మృతదేహం

రంగంపేట: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మర్రిపూడి గ్రామానికి చెందిన మోతుకూరి రవితేజ (28) చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. ఇటీవలే తన చెల్లెలకు వివాహం చేశాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో తనకు వివాహం కావడం లేదని, పైగా కుటుంబ భారం అంతా తానే మోయాల్సి వస్తోందని, మనస్తాపంతో ఉన్నాడు. గురువారం మర్రిపూడిలోని తన పొలంలోకి వెళ్లి గడ్డి మందు సేవించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడని తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం ప్రకారం కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ చెప్పారు.